ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 వరంగల్

సోమవారం 15 ఏప్రిల్ 2024



కాశిబుగ్గలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన కలెక్టర్, అధికారులు

అంబేద్కర్ ఆశయాలను నెరవేరుద్దాం: కలెక్టర్

వరంగల్ సిటీ, ఏప్రిల్ 14: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను నెరవేరుద్దామని కలెక్టర్ ప్రావీణ్య పిలుపునిచ్చారు. ఆదివారం అంబేద్కర్ జయంతి వేడుకలు కాశిబుగ్గ జంక్షన్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ ప్రావీణ్య, గౌరవ అతిథులుగా గ్రేటర్ మున్సిపల్ కమిషన ర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లా డుతూ.. అంబేద్కర్ రాజ్యాంగంలో అన్ని వర్గాల అభివృద్ధికి దోహదపడేలా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారిని భాగ్యలక్ష్మి, డీఆర్‌డీఓ కౌసల్యదేవీ, జిల్లా పరిశ్రమల అధికారి నర్సింహమూర్తి, అంబే ద్కర్ విగ్రహ వ్యవస్థాపక అధ్యక్షులు జన్ను భాస్కర్, సిలువేరు శ్రీనివాస్, కేవీపీఎస్ నాయకులు ఆరూరి కుమార్, ఆవుల ఉదయ్, కొంగర వరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మన బండే.. పెట్టేయ్..



బల్దియా అధికారులు వాడుతున్న తెలుపు రంగు నెంబర్ ప్లేట్ వాహనాలు

- బల్దియాలో వాహనాల కేటాయింపులో కక్కుర్తి
- సొంత కార్లను వినియోగిస్తున్న కొందరు అధికారులు
- ట్యాక్సీ కార్లకు బదులు సొంత వాహనాల వాడకం
- నిరుద్యోగుల పొట్టలు కొడుతున్న వైనం
- కమిషనర్ స్పందించాలని వేడుకోలు
- ఈ యేడు నుంచైనా నిబంధనలు పాటించాలని వినతి

> వారికి నెలకు లక్షల్లో జీతాలు వస్తుంటాయి.. మళ్లీ ప్రభుత్వం నుంచి వచ్చే ప్రత్యేక అలవెన్సులు పొందుతారు. అయినా అక్కడక్కడా హస్తవాసి ఉపయోగించడం షరా మామూలే.. ఇన్ని అవకాశాలున్నా వారికి ధనాపేక్ష ఆగలేదు. గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థలో అద్దె కార్ల కేటాయింపులో స్వార్థ బుద్ధి ప్రదర్శిస్తున్నారు. మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో అధికారులకు కేటాయించే ప్రైవేటు అద్దెవాహనాల విషయంలో కొందరు అధికార దాహాన్ని చూపిస్తున్నారు. నిరుద్యోగులకు జీవన భృతి కోసం ప్రభుత్వం నుంచి ఇచ్చిన కార్లు (వాహనాలు) కాదని.. సొంత వాహనాలను పెట్టుకుంటున్నారు. అడ్డదారిలో కోట్లు సంపాదించి నిరుద్యోగుల పొట్టకొడుతున్నారు. రోజువారి డ్రైవర్లు, ఓనర్ల కుటుంబాలను బజారునేస్తున్నారు.

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 14: వరంగల్ బల్దియా కేంద్రంగా అక్రమంగా వాహనాల కేటాయింపు యథేచ్ఛగా జరుగుతోంది. బల్దియా పరిధిలో వివిధ హోదాల్లో పని చేస్తున్న అధికారులకు నడిపేందుకు 36 అద్దె కార్లు కేటాయించగా.. వీటిలో పెద్ద మొత్తంలో అధికారుల సొంత వాహనాలే వినియోగిస్తున్నారు. పసుపు పచ్చ నెంబర్ ప్లేటు వాహనాల స్థానంలో తెలుపు (సొంత) నెంబర్ ప్లేటు ఉన్న వాహనాలను పెట్టేసుకుంటున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లు, బ్యాంకులు, దళిత బంధు పథకం ద్వారా నిరుద్యోగులు తీసుకున్న వాహనాలకు కార్పొరేషన్‌లో అద్దెకు ఉపయోగించాల్సి ఉండగా, నిబంధనలు కాదని సొంత కార్లలో చక్కర్లు కొడుతున్నారు. అయితే కొందరు అధికారులు నిరుద్యోగుల అద్దె కార్లు వాడుతున్నప్పటికీ సమయానికి బిల్లులు చెల్లించడంలో కావాలనే కాలయాపన చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అధికారులకు వాహనాలు

నగర పాలక సంస్థ పరిధిలోని పలు వింగ్ అధికారులకు 36 కార్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ అనుమతినిచ్చింది. ఇందులో కమిషనర్, మేయర్‌లకు ప్రభుత్వ వాహనాలు కేటాయించగా, సీపీ, టీపీవోలకు ఒక్కో వాహనం, ఇద్దరు డీసీలు, నలుగురు ఆర్‌వోలు, ఒక ఏసీ, ఇద్దరు ఎస్ఈలను కలుపుకుని 10 వాహనాలు ఉన్నతాధికారులకు కేటాయించింది. మిగతా 26 వాహనాలు డీఈ, ఈఈ, టీపీవో, సీఎంహెచ్‌వోకు కేటాయించారు. వీరి వాహనాలకు ప్రభుత్వం ప్రతీ నెల రూ.33వేలు అద్దె చెల్లిస్తోంది. జీవో ఎంఎస్ నెంబరు 170 ఫైనాన్స్ ఇయర్ 2017 ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేసే అధికారుల సౌకర్యార్థం నిరుద్యోగుల నుంచి పసుపు పచ్చ నెంబర్ ప్లేటు కలిసిన వాహనాలను టెండర్ల ద్వారా పిలిచి అగ్రిమెంట్ ప్రకారం కార్ల కేటాయింపు జరపాలి.

సొంతవే వినియోగం

వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కొందరు అధికారులు తమ భార్య, పిల్లలు, బంధువులు, అనుయాయుల పేర్ల మీద వాహనాలు కొనుగోలు చేసి కార్యాలయంలో పెట్టుకుంటున్నట్లు సమాచారం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక ప్రభుత్వ అధికారికి కేటాయించే వాహనానికి ఎల్లో నెంబర్ ప్లేట్, ఆరు మాసాల పొల్యూషన్ సర్టిఫికెట్, ఒక సంవత్సరం ఇన్స్యూరెన్స్ వాహన యజమానికి బ్యాడ్జీ సర్టిఫికెట్, లైసెన్స్ కలిగి ఉండాలి. కానీ కొందరు కక్కుర్తి అధికారులు వారే స్వయంగా వాహనం నడపడం, బంధువులు, లేదా శానిటేషన్ సిబ్బందిని సొంత పనులకు, వాహనాలకు డ్రైవర్లుగా ఉపయోగించుకుని వచ్చిన డబ్బులు జేబులో వేసుకుంటున్నట్టు నిరుద్యోగులు తెలిపారు.

నిరుద్యోగుల నిరాశ

అయితే బల్దియాలో కొందరు అధికారులు నిబంధనలు అతిక్రమించి సొంత వాహనాలను వినియోగిస్తూ నెలవారిగా వచ్చే డబ్బులను జేబులో వేసుకుంటున్నారు. అంతేకాక నిరుద్యోగుల పొట్టకొడుతూ.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అయితే వాహనాలు వినియోగించే అధికారులు.. ప్రతీ నెల డబ్బులు తీసుకోవాలంటే లాగ్ బుక్ నింపాల్సి ఉంది. కానీ ఆ నిబంధన ఎక్కడా కనిపించడం లేదు.

దృష్టి పెట్టాలి..

పదేళ్లుగా బల్దియా కార్యాలయం కేంద్రంగా ఉన్నతస్థాయి అధికారులు ప్రైవేటు అద్దె కార్లకు బదులు సొంత వాహనాలు వాడుతున్నట్టు అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు అందాయి. కానీ వరంగల్ బల్దియాలో పని చేయడానికి వచ్చిన అధికారులు రెండు, మూడు మాసాలకంటే ఎక్కువ రోజులు పని చేయకపోవడం శాపంగా మారింది. చాలామంది అధికారులు అద్దె కార్ల సమస్యను చక్కదిద్దాలనే అనుకున్న తరుణంలోనే బదిలీ కావడంతో సమస్య తిరిగి మొదటికి వస్తోంది. కొత్తగా వచ్చిన కమిషనర్ పట్టించుకుంటే తప్ప.. ఈ అడ్డదారి వాహనాలకు అడ్డుకట్ట వేయలేమని నిరుద్యోగులు పేర్కొంటున్నారు.



కొత్త నిబంధనలు

ఈ యేడు మార్చి 31న వార్షిక సంవత్సరం ముగుస్తుండడంతో కార్పొరేషన్‌కు పెట్టిన అద్దె కార్ల అగ్రిమెంట్ కూడా ముగియనుంది. వచ్చే యేడు నుంచి ప్రత్యేక సర్క్యులర్ విడుదల చేసిన తర్వాత వాహనాలకు ఎంపిక చేసి అధికారులకు కేటాయించనున్నట్లు గ్రేటర్ అధికారులు వెల్లడించారు. ఏప్రిల్ నుంచి ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనాలు ఎంపిక చేసి అధికారులకు ఇవ్వాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

జాడలేని భూసార పరీక్షలు

- పైడిపెల్లిలో నాలుగేళ్లుగా నిలిచిన పరీక్షలు
- నేలపై రైతులకు అవగాహన కరువు
- విచ్చల విడిగా ఎరువుల వాడకం
- నిస్సారంగా మారుతున్న భూములు



పైడిపల్లిలోని భూసార పరీక్షల ల్యాబరేటరీ

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 14: రైతులు ఎంతో ఉపయోగపడే భూసార పరీక్షలు జిల్లాలో కరువయ్యాయి. భూములో ఉండే ఖనిజలవణాలు, పోషకాలను బట్టి ఏఏ పంటలకు ఏఏ ఎరువులు ఎంత మోతాదులో వాడాలో వ్యవసాయ శాఖ అధికారులు చెబుతుంటారు. వాటి ఆధారంగానే సాగు విధాన సూచనలిస్తారు. దీంతో పంట దిగుబడి కూడా పెరుగుతుంది. అశాస్త్రీయంగా ఎరువులు చల్లడంతో భూసారం నిస్తేజమవుతుందని మేధావులు పేర్కొంటున్నారు.

నాలుగేళ్లుగా నిలిచిన పరీక్షలు..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సమీపంలో పైడిపెల్లి రోడ్‌లో సహాయ వ్యవ సాయ సంచాలకులు భూసార, విత్తన పరీక్షలు నిర్వహించే వారు. రైతుల భూముల నుంచి మట్టి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించేవారు. 2019 కంటే ముందు ఏటా సుమారు 15 వేల భూసార పరీక్షలు చేసి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. 2019 నుంచి ప్రభుత్వం భూసార పరీక్షల విషయాన్ని పక్కన పెట్టింది. భూసార పరీక్షలకు నిధులు, కిట్లు, రసాయనాలు అందించడం మానేసింది. దీంతో భూసార పరీక్షలు పూర్తిగా నిలిచిపోయాయి.

మట్టి నమూనా సేకరణకు సరైన సమయం

సాగు భూముల్లో మట్టి నమూనా సేకరణకు ఇదే సరైన సమయమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఏప్రిల్, మే మాసాల్లో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయాలని సూచిస్తున్నారు. భూసార పరీక్షలలో వచ్చిన రిపోర్టును బట్టి ఏ పంట వేసుకోవాలి, ఏఏ ఎరువులు, మందులు వాడాలన్నది రైతుకు వివరించే అవకాశముంటుందని చెబుతున్నారు. దీంతో జూన్ మాసంలో వర్షాలు పడడం

మిగతా 8వ పేజీలో..



గులాబీలతో దర్శనమిస్తున్న అమ్మవారు

భద్రకాళికి లక్ష గులాబీ అర్చన

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 14: వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి దేవాలయంలో కొనసాగుతున్న వసంత నవరాత్రోత్సవాలు ఆదివారానికి ఆరో రోజుకు చేరుకున్నాయి. అమ్మవారికి సుప్రభాత సేవ, నిత్యాహ్నికం నిర్వహించిన అనంతరం నవరాత్రోత్సవాల్లో భాగంగా జపం, హోమం, అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి లక్ష సెంట్ గులాబీలతో పుష్పార్చన నిర్వహించారు. అనంతరం విశేష భోగములతో మహా నివేదన చేశారు. శష్ఠి దేవతకు ఆది దేవత స్కంధుడు ఆదివారం రోజు దేవత సూర్యుడు. సూర్యుడి ద్వారా లోకానికి వెలుగును ప్రసాదించేది ఆ జగన్మాతే కాబట్టి ఆదివారం అమ్మవారికి గులాబీ వెలుగుపూలతో అర్చన నిర్వహించినట్లు ప్రధానార్చకుడు భద్రకాళి శేష తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన జేవీఎస్ శ్రీధర్, జేఎస్ఎల్ పావని, కుమారి శ్రీయలు అమ్మవారి పుష్పాలంకరణ సేవాకర్తలుగా ఉన్నారు. ఆదివారం కావడంతో పెద్దసంఖ్యలో వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో శేషభారతి నేతృత్వంలో సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోలు

- అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు: కలెక్టర్
- రాయపర్తి, ఇల్లందలలో పర్యటన

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 14 : ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ప్రావీణ్య హెచ్చరించారు.ఆదివారం ఇల్లందలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మండలంలోని రామవరం, వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించి, కేంద్రం నిర్వాహకులతో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఏరోజు నుంచి ధాన్యం వస్తుందని, ఇప్పటివరకు కొనుగోలు, వాటిలోని తేమ శాతం పరిశీలించారు. ధాన్యం శుభ్రపరిచే యంత్రం అందుబాటులో ఉండాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేసిన మిల్లులకు పంపిస్తున్నారో లేదో ఆరా తీశారు. ధాన్యం కొనుగోలులో ఏమైన ఇబ్బందులు ఏర్పడితే కంట్రోల్ రూం నంబర్ 79950 50785ని సంప్రదించాలని సూచించారు. రైతులు ప్రతీ గింజను కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర పొందాలని సూచించారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 186 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇప్పటివరకు ప్రారంభించినట్లు స్పష్టం చేశారు. అమ్మ ఆదర్శ కమిటీలతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆయా పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాల పరిస్థితిని తెలుసుకున్నారు. మే 13న పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా ప్రతీ పోలింగ్ కేంద్రంలో మౌలిక సదు పాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్డీవో పీడీ కౌసల్యదేవి, జిల్లా పౌరసరఫరాల అధికారి శివప్రసాద్ రెడ్డి, మేనేజర్ సంధ్యారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రసాదరావు, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, డీఈవో వాసంతి, తహసీల్దార్ విజయ్‌సాగర్, ఏవో రాంనర్సయ్య, ఏపీఎం వేణు తదితరులు పాల్గొన్నారు.

- రాయపర్తి: రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని కలెక్టర్ ప్రావీణ్య స్పష్టం చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిచేస్తామన్నారు. నర్సంపేట ప్రాంతంలో ధాన్యం ఆలస్యంగా రావడం దృష్ట్యా వాటి అవసరాల మేరకు మిగతా కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం మైలారం, మొరిపిరాల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో పాఠశాలలో అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీఎస్‌వో శివప్రసాద్, డీఆర్డీవో కౌలస్యదేవి, డీఎం సంధ్యారాణి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్ నాయక్, డీపీఎం భవాని తదితరులు పాల్గొన్నారు.



ఇల్లందలో ధాన్యం తేమను పరిశీలిస్తున్న కలెక్టర్



క్రీడలపై కుట్ర

- అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు చుక్కెదురు
- స్పోర్ట్స్ హాస్టల్ నుంచి తరలించేందుకు ప్రయత్నాలు
- అంతర్మథనంలో క్రీడాకారులు..
- ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి

వివరాలు : 7లో

నేటి ప్రజావాణి రద్దు

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 14: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది ఉన్నందున ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ సమస్యలపై కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు.

అమ్మను తిడుతోందని నానమ్మ హత్య

- 13 ఏళ్ల బాలుడి ఘాతుకం
- జనగామ జిల్లాలో దారుణ ఘటన

జఫర్‌గఢ్, ఏప్రిల్ 14: తల్లిని తరచుగా దూషిస్తూ గొడవ పెట్టుకుంటోందని ఆగ్రహించిన 13 ఏళ్ల మనవడు.. 65 ఏళ్ల వయసున్న నానమ్మను కత్తితో పొడిచి చంపిన దారుణ ఘటన జనగామ జిల్లాలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జఫర్‌గఢ్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులకు ఓ కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉండగా అందరి వివాహాలు చేశారు. కొడుకు సుమారు పదేళ్ల కిందట అనారోగ్యంతో చనిపోయాడు. అప్పటికే ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. అప్పటి నుంచి కోడలు, ఇద్దరు మనవలతో కలిసి అందరూ ఒకే ఇంట్లో ఉంటున్నారు. వ్యవసాయంతో పాటు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు.

అయితే కొన్నాళ్లుగా అత్తాకోడళ్ల మధ్య కుటుంబ సమస్యలపై తరచూ గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి కూడా పరస్పర దూషణలతో తీవ్రంగా గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో ఆగ్రహించిన చిన్న మనవడు కత్తితో నానమ్మ ఛాతిపై పొడిచాడు. దీంతో తీవ్ర రక్తస్రావం జరిగి కింద పడిపోయింది. కుటుంబీకులు వెంటనే ఆమెను అదే రాత్రి హనుమకొండ ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలోనే చనిపోయింది. ఆలస్యంగా సమాచారం అందుకున్న వర్ధన్నపేట సీఐ సూర్యప్రకాశ్, జఫర్‌గఢ్ ఎస్ఐ శీలం రవియాదవ్ ఆదివారం ఘటనాస్థలాన్ని సందర్శించారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సొంతగూటికి రాజయ్య

- కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 14: స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఎట్టకేలకు సొంతగూటికి చేరుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్ సమక్షంలో ఆదివారం సిద్ధిపేట జిల్లా ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో పార్టీ కండువా కప్పుకున్నారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా ఉన్న సమయంలో రాజయ్య అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకు టికెట్ రానందుకు నిరసనగా ఫిబ్రవరి 3న బీఆర్ఎస్ పార్టీకి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. వారం రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో చేరుతానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సింగపురం ఇందిర అనుచరులు రాజయ్యను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోవద్దంటూ పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. అయినప్పటికీ రాజయ్య సీఎం రేవంత్ రెడ్డిని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను, పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేను, మంత్రులను కలిసి పార్టీ చేరిక అంశమై చర్చించారు. అయినా రాజయ్యకు కాంగ్రెస్ పార్టీ నుంచి ఆహ్వానం రాలేదు.

ఈ క్రమంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్చి 13న వరంగల్ లోక్‌సభ టికెట్‌ను కడియం కావ్యకు ఇస్తున్నట్లు ప్రకటించారు. తదనంతరం మార్చి 28న బీఆర్ఎస్ పార్టీ నుంచి తాను పోటీ చేయనని కావ్య టికెట్‌ను నిరాకరిస్తూ కేసీఆర్‌కు లేఖ రాశారు. మార్చి 29న కాంగ్రెస్ నాయకులు కడియంను పార్టీలోకి ఆహ్వానించడం, 31న కడియం శ్రీహరి, కావ్య రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం, ఏప్రిల్ 1న వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా కడియం కావ్య పేరును ప్రకటించడం వరుసగా జరిగిపోయాయి. అప్పటి నుంచి రాజయ్య బీఆర్ఎస్ పార్టీ తనకు వరంగల్ లోక్‌సభ టికెట్ ఇస్తే తిరిగి పార్టీలో చేరడానికి సిద్ధమయ్యారు. ఈ నెల 12న ఎంపీ టికెట్ రాజయ్యకు ప్రకటిస్తారనే వార్తలు రావడంతో రాజయ్య ఎర్రవెల్లికి వెళ్లారు. కానీ చివరికి కేసీఆర్ హనుమకొండ జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్ పేరును ప్రకటించడంతో రాజయ్య ఎర్రవెల్లిలో కేసీఆర్‌ను కలువకుండానే వెనుదిరిగారు. చివరకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజయ్య ఆదివారం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.



కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే రాజయ్య

మైనారిటీ నిరుద్యోగులకు చక్కటి అవకాశం

వడ్డెపల్లి, ఏప్రిల్ 14 : మైనారిటీల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాలను రూపొందించి అమలు చేస్తోంది. పోటీ పరీక్షల కోసం మైనారిటీ ఉద్యోగులకు ఉచిత శిక్షణను ఇస్తూ వారిని ప్రోత్సహిస్తోంది. యూపీఎస్సీ- సీఎస్ఎటీ- 2025 పరీక్ష కోసం 2024-25 విద్యా సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ 100 మంది మైనారిటీస్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ నిర్వహిస్తుంది. రిజర్వేషన్ల నిబంధనల ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు, అన్ని రిజర్వ్ కేటగిరీలలో దివ్యాంగులకు 5 శాతం సీట్లను కేటాయించారు.

దరఖాస్తు చేసుకునే విధానం

యూపీఎస్సీ (సీఎస్ఏటీ- 2025) సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్టులో ప్రవేశం కోసం అన్ని జిల్లాల్లోని సాధారణ/ ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీస్ అభ్యర్థులు ఈ నెల 22 లోగా ఆన్‌లైన్ లో గిగిగ్స్.రుట్సుజీట్ష జ్ప్సుబ్బ్యు.చిఱఙ౫్రి.జీ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలి. స్క్రీనింగ్ టెస్టు ఈనెల 28న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలల్లో నిర్వహిస్తారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మేన శ్రీను, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి



ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని జిల్లాలోని మైనారిటీస్ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి. డిగ్రీ పూర్తి చేసిన సాధారణ, ప్రొఫెషనల్ అభ్యర్థులు ఈ నెల 22 లోగా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను చేసుకోవాలి. ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన నిర్వహిస్తారు. ఈ నెల 28న నిర్వహించే స్క్రీనింగ్ టెస్టులో మైనారిటీ అభ్యర్థులు పాల్గొనాలన్నారు. వివరాలకు ఫోన్ నంబరు : 040- 23236112 లో సంప్రదించాలి.

కడియం కావ్యకే మా మద్దతు


ఎమ్మెల్యే శ్రీహరిని కలిసిన దళిత సంఘాల నేతలు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 14 : వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యకు తెలంగాణ మాదిగ దండోరా, టీఎమ్మార్పీఎస్, తెలంగాణ బైండ్ల సంఘం, మాల మహానాడు నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం హనుమకొండలోని ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాసంలో కలిసి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించి మంద కృష్ణ మాదిగకు తగిన బుద్ధి చెబుతామని తెలిపారు. వర్గీకరణ పేరుతో మాదిగలను, మాదిగ ఉప కులాలను మంద కృష్ణ మోసం చేస్తున్నారని వారు ఆరోపించారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. మంద కృష్ణ మాదిగ జాతికే ద్రోహం చేయాలని చూస్తున్నారని, దేశ వ్యాప్తంగా దళితుల ఊచ కోతకోస్తున్న బీజేపీ పంచనచేరి ఏ విధంగా ఓటు అడుతున్నాడో చెప్పాలని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని దేశాన్ని మతతత్వ పార్టీ నుంచి కాపాడుకోవాలని కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపకులు జన్ను కనకరాజు, జాతీయ అధ్యక్షుడు వేముల బలరాం, రాష్ట్ర అధ్యక్షుడు కోరిపెల్లి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పద్మారావు, బైండ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అదుళ్ల గౌరిశంకర్, మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి పసుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై కుట్ర


హనుమకొండ జేఎన్ఎస్‌లోని హ్యాండ్‌బాల్ మినీ స్టేడియం

- అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు చుక్కెదురు
- స్పోర్ట్స్ హాస్టల్ నుంచి తరలించేందుకు ప్రయత్నాలు
- అంతర్మథనంలో క్రీడాకారులు.. ఖండిస్తున్న క్రీడా సంఘాలు
- ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి


హనుమకొండ జేఎన్ఎస్‌లోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 14 : అథ్లెటిక్స్ హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు స్పోర్ట్స్ హాస్టల్ అందని ద్రాక్షగా మారుతోందనే సమాచారంతో అంతర్మథనం చెందుతున్నారు. యేళ్లతరబడి అథ్లెటిక్స్ హ్యాండ్‌బాల్ క్రీడల్లో అద్భుత ప్రతిభ చాటుతూ స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించినక్రీడాకారులను ఇక్కడి నుంచి తరలించాలనే ప్రయత్నాలు జరుగుతున్నట్లు వస్తున్న వార్తలతో ఆందోళన చెందుతున్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాలతో రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లోని అథ్లెట్లకు వేరే ప్రాంతాలకు పంపించే యోచనలో స్పోర్ట్స్ అధికారులు ఉన్నట్లు తెలిసి క్రీడాకారులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుల కేంద్రంగా పేరుగాంచిన హనుమకొండలోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్ తీరుపై జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ, సీతక్కలు స్పందించాలని పలు క్రీడా సంఘాల బాధ్యులు వేడుకుంటున్నారు.

తరలింపు ఆలోచన

హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూస్టేడియం (జేఎన్ఎస్)లో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ(డీఎస్ఏ) ఆధ్వర్యంలో మూడు దశాబ్దాల నుంచి రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ ఆధారంగా రాణించిన క్రీడాకారులకు వసతి కల్పిస్తూ క్రీడల్లో శిక్షణ అందిస్తోంది. అయితే జిమ్నాస్టిక్ క్రీడాకారులను మినహాయించి అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులను వేరే ప్రాంతాలకు తరలించే ప్రయత్నం జరుగుతోందనే వాదనలతో క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారు అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడలను హాస్టల్ నుంచి తొలిగించి వాటి స్థానంలో మరో రెండు క్రీడలను అనుమతించే అవకాశం ఉందని పలువురు క్రీడా సంఘాల సభ్యులు అనుమానంవ్యక్తం చేస్తున్నారు.

కొందరి కుట్ర

కొందరు వ్యక్తులు తమకు అనుకూలంగా ఉన్న క్రీడలను హాస్టల్‌లో వసతి కల్పించాలనే దురాలోచనతోనే అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు స్పోర్ట్స్ హాస్టల్ ఎత్తివేసే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా స్పోర్ట్స్ హాస్టల్‌లో అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు అనుమతి ఇవ్వకపోవడంతో ఇంతకాలం శిక్షణ పొందిన క్రీడాకారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. దీనిపై స్పోర్ట్స్ అధికారులు పునరాలోచన చేయావలసిన అవసరం ఉందని, లేదంటే నిరసనలకు శ్రీకారం చుడతామని క్రీడాకారులు, క్రీడాసంఘాల బాధ్యులు హెచ్చరిస్తున్నారు.

30 ఏళ్ల కిందట

30 ఏళ్ల కిందట టీడీపీ హయాంలో జిల్లాకు చెందిన అప్పటి మంత్రి దాస్యం ప్రణయ్‌భాస్కర్ ప్రత్యేక చొరవతో జేఎన్ క్రీడా మైదానం అభివృద్ధితో పాటు క్రీడాకారులకు భోజన, బస వసతి కల్పించడానికి రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌ను నిర్మించారు. జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు వసతితోపాటు పౌష్టికాహారం, అనుభవజ్ఞులైన కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణ అందిచండం కోసం ఉమ్మడి జిల్లా కేంద్రంగా స్పోర్ట్స్ హాస్టల్ నిర్మించారు. 9 ఏళ్ల వయస్సులోనే క్రీడాకారుల కోసం యేటా డీఎస్ఏ ఆధ్వర్యంలో రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలు కల్పిస్తోంది. డీఎస్ఏ ఆధ్వర్యంలో బ్యాటరీటెస్ట్‌లు నిర్వహిస్తూ ప్రతిభ ఆధారంగా స్పోర్ట్స్ హాస్టల్‌కు క్రీడాకారులను ఎంపిక చేస్తారు. ఎంపిక చేసిన క్రీడాకారులుకు మౌలిక వసతులతోపాటు శిక్షణ అందింస్తోంది. నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ క్రీడాకారుల కు బాసటగా నిలుస్తూ.. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో తాత్కాలిక డీఎస్ఏ కోచ్‌ల పర్యవేక్షణలో జేఎస్ఎస్‌లోని వివిధ మైదానాల్లో పలు క్రీడాంశాలలో శిక్షణను అందిస్తోంది. అలాగే రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో పౌష్టికాహారంతో పాటు క్రీడా దుస్తులు, వసతి సౌకర్యాలను అందిస్తోంది. ప్రధానంగా అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, జిమ్నాస్టిక్స్ క్రీడలతోపాటు పలు క్రీడాంశాలలో ఓనమాలు నేర్చుకొని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకుంటున్నారు. స్పోర్ట్స్ కోటాలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో వందలాదిగా ఉద్యోగాలు పొందారు.

మాకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదు..

జి.అశోక్‌కుమార్, జిల్లా యువజన క్రీడల అధికారి



రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో వసతి పొందుతున్న అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులను వేరే చోటికి తరలించాలని మాకు ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు అందలేదు. ఇటీవల హైదరాబాద్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆధ్వర్యంలో సమావేశం జరిగింది వాస్తవమే. అందులో ఇక్కడి క్రీడాకారుల ప్రతిభ, స్పోర్ట్స్ హాస్టల్ నిర్వహణ వంటి అంశాలపై చర్చ జరిగింది.

క్రీడాకారులకు నష్టం జరుగుతుంది..

బైరబోయిన కైలాస్ యాదవ్, వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి



రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో వసతి పొందుతున్న అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులను వేరే చోటికి తరలిస్తే తీవ్ర నష్టం జరుగుతుంది. క్రీడాకారులను ఉన్న ఫలంగా హాస్టల్ నుంచి పంపించే ప్రయత్నం సరైందికాదు. అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారుల మనోవేదనను అర్థం చేసుకొని జిల్లా క్రీడాశాఖ అధికారులు సాట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి హాస్టల్‌ను క్రీడాకారులను వేరే చోటుకు తరలించకుండా పునరాలోచన చేయాల్సి ఉంది.

తరలించే ప్రయత్నం సరైందికాదు

ఇండ్ల నాగేశ్వర్‌రావు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు



రీజినల్ స్పోర్ట్స్‌హాస్టల్‌లో అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులను వేరే ప్రాంతాలకు తరలించే ప్రయత్నం సరైందికాదు. దీనిని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోంది. అందుబాటులో ఉన్న అకాడమీ, స్పోర్ట్స్ హాస్టల్‌లో మౌలిక వసతులను కల్పించకుండా కొందరు స్వార్థపరులు క్రీడాకారులను అంధకారంలోకి తీసుకపోయే ప్రమాదం ఉంది. నగరంలో నూతన అకాడమీల ఏర్పాటుకు స్పోర్ట్స్ అధికారులు, మంత్రులు కొండా సురేఖ, సీతక్క కృషి చేయాలి.

కళాకారులకు పుట్టినిల్లు ఓరుగల్లు

- ఏఐఆర్ మాజీ డైరెక్టర్ జైపాల్ రెడ్డి


ఆల్ ఇండియా రేడియో జర్నలిస్టులతో జైపాల్ రెడ్డి

హనుమకొండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు నగరం కళాకారులకు పుట్టినిల్లని ఆల్ ఇండియా రేడియో మాజీ ఉపసంచాలకుడు చల్లా జైపాల్ రెడ్డి అన్నారు. వరంగల్ రేడియో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు మోటే చిరంజీవి ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ రేడియో కేంద్రం ఎంతోమంది కళాకారుకులకు అవకాశం కల్పించిందని అన్నారు. ఎంతో మంది వ్యాఖ్యాతలు ఇక్కడ పని చేసి పేరు ప్రతిప్రతిష్టలు సంపాదించారని అన్నారు. వ్యాఖ్యాతలకు గతంలో ఉన్న కార్యక్రమాలు ఇప్పుడు లేవని, అలాగే వ్యాఖ్యాతల కార్యక్రమాలు అప్పటి కంటే ఇప్పుడు తగ్గాయని అన్నారు. చక్కటి స్వరంతో కార్యక్రమాలను వ్యాఖ్యాతలు విజయవంతం చేస్తున్నారని అన్నారు. వరంగల్ రేడియో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం రిటైర్డ్ సీనియర్ వ్యాఖ్యాతలు నెల్లుట్ల సంధ్య, మొగిలిచెర్ల జనార్దన్‌లను ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ.. తమ సేవలను గుర్తించి సన్మానం చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. అలాగే రేడియోతో ఉన్న 30 యేళ్ల అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రేడియో జర్నలిస్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అర్షం సదానందం, గౌరవ సలహాదారు డాక్టర్ ఎల్లయ్య, అసోసియేషన్ నాయకులు ఓదెల కృష్ణ, డాక్టర్ చంద్రశేఖర్, రామక్రిష్ణ, డాక్టర్ శ్రీనివాస్, పంకజ్ మోహన్, స్వప్న, స్వాతి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ పొల్యూషన్ బైక్ స్వాధీనం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 14 : సౌండ్ పొల్యూషన్ సైలెన్సర్ బైక్ వాడి అతివేగంతో వెళుతున్న వినయ్‌తేజరెడ్డి అనే విద్యార్థిపై కేయూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం సాయంత్రం సౌండ్‌తో కూడిన సైలెన్సర్ కలిగిన బుల్లెట్‌పై అతివేగంగా వెళుతున్న విద్యార్థిని భీమారం జంక్షన్ వద్ద అరెస్టు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. బుల్లెట్ స్వాధీనం చేసుకుని విద్యార్థిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రెడ్డిపురం కుంటలో మునిగి యువకుడి మృతి


వాజీద్ మృతదేహం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 14 : కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపురం కుంటలో మునిగి యువకుడు మరణించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. హనుమకొండ అగ్నిమాపక శాఖధికారి నాగరాజు కథనం ప్రకారం.. రెడ్డిపురం కుంటలో ఈత కోసం దిగిన యువకుడు మునిగిపోయాడని వచ్చిన సమాచారం మేరకు వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. బోటు సహాయంతో కుంటలో గాలించగా గంట తర్వాత మృతదేహం లభించింది. యువకుడి ఆచూకీకోసం ఆరాతీయగా రాయపురకు చెందిన వాజీద్ (25)గా గుర్తించారు. కాగా, విచారణ కోసం స్థానిక పోలీసులకు మృతదేహన్ని అప్పగించినట్లు ఫైర్ ఆఫీసర్ నాగరాజు తెలిపారు. మృతదేహన్ని వెలికితీయడంలో హనుమకొండ అగ్నిమాపకశాఖధికారి నాగరాజుతోపాటు వరంగల్ జిల్లా ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ రవీందర్, హనుమకొండ, వరంగల్ ఫైర్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

- రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు
- రత్నగిరిలో విషాదం


రాహుల్ (ఫైల్)

భీమదేవరపల్లి, ఏప్రిల్ 14 : భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామానికి చెందిన బానోతు రాహుల్ (15) అనే విద్యార్థి రోడ్డు ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వంగర ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం తన అమ్మమ్మ గారి ఊరు సిద్దిపేట జిల్లా జిల్లెలగడ్డకు వెళ్లి రాహుల్ తిరిగి వస్తున్నాడు. భీమదేవరపల్లి మండలం మంగళపల్లి శివారులో ట్రాక్టర్ డ్రైవర్ ఆకస్మాత్తుగా మూల మలుపు వద్ద తిప్పడంతో రాహుల్ ద్విచక్రం వాహనానికి ట్రాక్టర్ తగిలి రాహుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రాహుల్‌ను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ రాహుల్ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. రాహుల్ 2024 మార్చిలో పదో తరగతి పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తు న్నాడు. మండలంలోని వంగర హైస్కూల్లో పదో తరగతి చదివి పరీక్షలు రాశాడు. 15ఏళ్ల బాలుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నారు.


నీరుకుళ్లలో సంచరిస్తున్న పునుగు పిల్లలు

- జూపార్క్‌కు తరలించిన ఫారెస్ట్ అధికారులు


బకెట్‌లో దూరిన పునుగు పిల్లి

ఆత్మకూరు, ఏప్రిల్ 14 : అరుదైన పునుగు పిల్లులు నీరుకుళ్ల గ్రామానికి చెందిన పంచి నేని రాజేశ్వరరావు ఇంట్లో ఆదివారం దర్శనమిచ్చాయి. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో తన ఇంటికి ఉదయం పునుగు పిల్లి కుక్కలను చూసి ఇంట్లోకి వచ్చిందన్నారు. వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి పునుగు పిల్లి అని నిర్ధారించుకుని, బంధించి వరంగ ల్ జూపార్క్‌కు తరలించారు. మరొకటి చెట్ల పొదల్లోకి పారిపోగా కుక్కలు వెంబడించడంతో పారిపోయిందన్నారు. గత వారం క్రితం కుక్కలు వెంబడించి పునుగు పిల్లిని చంపి తిన్నట్లు గ్రామస్తులు తెలిపారు. అరుదైన పునుగు పిల్లి గ్రామంలో సంచరించడంతో గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. వెంకటేశ్వరస్వామికి ఎంతో ఇష్టమైన పునుగు పిల్లి తన ఇంట్లోకి రావడంతో ఎంతో అదృష్టంగా వెంకటేశ్వరరావు భావిస్తున్నారు.

కేసీఆర్‌ను కలిసిన సుధీర్‌కుమార్


కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుధీర్‌కుమార్

రాంనగర్, ఏప్రిల్ 14 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి మారపెల్లి సుధీర్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. రెండు రోజుల కిందట సుధీర్‌కుమార్‌ను బీఆర్ఎస్ అభ్యర్థిగా కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. అవకాశం దక్కించుకున్న సుధీర్‌కుమార్.. ఆదివారం హైదరాబాద్‌లో కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సుధీర్‌కుమార్ వెంట మాజీ ఎమ్మెల్యే రాజయ్య కూడా ఉన్నారు. రాజయ్య ఎంపీ టికెట్ ఆశించినప్పటికీ సుధీర్ కుమార్‌కు అవకాశం దక్కిన విషయం తెలిసిందే. టికెట్ ఆశించి భంగపడ్డ రాజయ్యను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కేసీఆర్ వద్దకు తీసుకెళ్లారు. అభ్యర్థి సుధీర్ కుమార్‌తో పాటు రాజయ్య మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు.

బియ్యం దొంగలపై నజర్

- ప్రజా పంపిణీ బియ్యం అక్రమ రవాణా కట్టడికి చర్యలు
- ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం
- దందా చేసే వారి వివరాల సేకరణలో విజిలెన్స్
- పోలీసులు, ప్రజా ప్రతినిధుల ప్రమేయంపై ఆరా
- కేసులు పెట్టేందుకు రంగం సిద్ధం



వరంగల్ క్రైం, ఏప్రిల్ 14 : ప్రజాపంపిణీ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. దందా చేసేవారిపై కేసులు పెట్టేందుకు సిద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా చర్యలకు పూనుకున్న ప్రభుత్వం.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పీడీఎస్ రైస్ కట్టడిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని వరంగల్‌కు పంపింది. పదిరోజులుగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రహస్యంగా పర్యటిస్తూ అక్రమార్కుల వివరాలు సేకరిస్తున్నారు. కోట్లలో నడుస్తున్న దందాలో పెద్ద తలకాయలు ఉన్నట్లు సమాచారం ఉండటంతో ఆ కోణంలో కూడా అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల కాళేశ్వరం, ఎల్కతుర్తి, చిల్పూరు ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. యథేచ్ఛగా సాగుతున్న దందా వెనుక పలువురు పోలీసులు, ప్రజాప్రతిధుల సహకారం అందుతుందనే ఆరోపణలున్నాయి. దందాకు సహకరించే వారికి నెలవారీగా మామూళ్లు అందుతాయని అధికారిక సమాచారం.

ప్రజాప్రతినిధులు, పోలీసుల ప్రమేయంపై ఆరా..

ఈ దందాలో ప్రజాప్రతినిధులు, పోలీసుల ప్రమేయంపై రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. హనుమకొండ నుంచి హుజూరాబాద్ వరకు దందా చేస్తున్న ఇద్దరు దళారులకు పలువురు పోలీసులు సహకరించారనే ఆరోపణలున్నాయి. సహకరించిన పోలీసుల వివరాలు విజిలెన్స్ అధికారులు సేకరించినట్లు తెలిసింది. వీరితోపాటు ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా దందా చేసే వారికి అండగా నిలుస్తున్న పోలీసులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల చిట్టా తయారు చేస్తున్నట్లు సమాచారం. మొత్తంగా ఈ దందాలో ప్రమేయం ఉన్న వారి జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి అప్పగించే పనిలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నట్లు తెలిసింది.

జిల్లా విజిలెన్స్ అధికారుల పనితీరుపై ఆరోపణలు

జిల్లాకు చెందిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తీరుపై పలు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాకు చెందిని కొంతమంది అధికారుల కనుసన్నల్లోనే ఈ దందా సాగుతుందనే విమర్శలున్నాయి. జిల్లాలో పనిచేసే ఒక హెడ్‌కానిస్టేబుల్ అధికారి ఒకే స్థానంలో దశాబ్దకాలంగా పనిచేస్తూ దందా చేసే వారికి అండగా ఉంటున్నాడనే ఆరోపణలున్నాయి. ఈ హెడ్‌కానిస్టేబుల్ పై అధికారులను మేనేజ్ చేస్తాడనే విమర్శలున్నాయి. దందా చేసే వారి నుంచి వసూళ్లు చేసి అధికారులకు స్థాయిల వారిగా ముట్టచెబుతాడనే ప్రచారం ఉంది. జిల్లా అధికారుల తీరు సరిగాలేకనే రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం జిల్లాలో పర్యటిస్తున్నట్లు అధికారిక సమాచారం.

ప్రాంతాల వారిగా దళారులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలువురు ఈ దందా చేస్తూ కోట్లు మూటగట్టుకున్నట్లు తెలిసింది. ప్రాంతాల వారిగా పెత్తనం చెలాయిస్తూ యథేచ్ఛగా పీడీఎస్ రైస్ దందా చేస్తున్నారు.

- భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌కు చెందిన ఒక వ్యక్తి వరంగల్, హనుమకొండ జిల్లాలో ఈ దందా చేస్తున్నట్లు తెలిసింది. ఈయనపై గతంలో పీడీ యాక్ట్ కేసు నమోదు అయినట్లు సమాచారం. గతంలో ఒక పోలీస్ కమిషనర్ ఈయనను నగరంలో ఉండకూడదనే ఆంక్షలు సైతం పెట్టినట్లు తెలిసింది. ఆ అధికారి బదిలీ అయ్యాక దందాను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు సమాచారం.
- మంథినికి చెందిన ఒక వ్యక్తి ఈ దందాలో నిష్ణాతుడనే పేరుంది. ఇతడు జిల్లాకు చెందిన విజిలెన్స్ అధికారులను సైతం మేనేజ్ చేస్తాడనే ప్రచారం ఉంది. భూపాలపల్లి, ములుగు ఏరియాల్లో ఇతడి మనుషులతో దందా సాగిస్తున్నట్లు సమాచారం.
- బుద్దారానికి చెందిన మరో వ్యక్తి సైతం ఈ దందా చేస్తాడని తెలిసింది.
- ములుగు జిల్లాకు చెందిన ఒక రైస్ మిల్లు యజమాని పీడీఎస్ రైస్ దందా చేస్తాడని తెలిసింది. తన మనుషులతో గ్రామాల్లోని పీడీఎస్ బియ్యం సేకరించి రైస్‌మిల్లు అడ్డుపెట్టుకుని పెద్దఎత్తున దందా చేస్తాడని సమాచారం.
- మంథనికి చెందిన ఒక వ్యక్తి మహారాష్ట్ర సిరివంచలో రైస్‌మిల్లు నడుపుతూ ఈ దందా చేస్తాడని తెలిసింది. ఇతడి దందాకు ఆ ఏరియా పోలీసులు సహకరిస్తారనే ప్రచారం ఉంది.
- ఇక హనుమకొండ నుంచి హుజూరాబాద్ వరకు ఇద్దరు వ్యక్తులు పీడీఎస్ రైస్ దందా చేస్తూ కోట్లు సంపాదించారనే ఆరోపణలున్నాయి. గ్రామాల నుంచి సేకరించే బియ్యాన్ని కిట్స్ కళాశాల ఏరియాలో, ఓఆర్ఆర్ ఏరియాలో నిల్వచేసి రాత్రి వేళల్లో కొంతమంది పోలీసుల సహకారంతో పొరుగు రాష్ట్రాలకు తరలిస్తారనే ప్రచారం ఉంది. ఈ ఇద్దరిలో ఒక వ్యక్తితో పలువురు పోలీసు అధికారులు సన్నిహితంగా ఉంటూ అతడు ఇచ్చే తాయిళాలు నెలనెల అందుకుంటారనే విమర్శలున్నాయి. ఇలా విచ్చలవిడిగా వరంగల్‌లో అన్ని ప్రాంతాల్లో దందా సాగుతున్నట్లు తెలిసింది. వీరందరి సమాచారం సేకరిస్తున్న రాష్ట్ర విజిలెన్స్ అధికారులు నివేదిక తయారు చేస్తున్నట్లు సమాచారం.



ఆంధ్రజ్యోతి WARANGAL CITY 8
వరంగల్ సిటీ
● వరంగల్ ● ఖిలావరంగల్ ● గీసుగొండ ● సంగెం
సోమవారం 15 ఏప్రిల్ 2024



ఐపీఎల్ ఫ్యాన్ పార్క్‌లో సందడిగా

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 14: జిల్లా క్రికెట్ అసోసియేషన్ (డబ్ల్యూడీసీఏ) ఆధ్వర్యంలో దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఐపీఎల్ ఫ్యాన్ పార్క్ సందడిగా జరిగింది. బీసీసీఐ నేతృత్వంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లపై ఆదివారం జరిగిన ఏఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లను నగరవాసులు ఆసక్తిగా తిలకించారు. ముంబై ఇండియన్స్ వర్సెస్ చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌కు అభిమానులు, యువత పెద్ద ఎత్తున తరలిరావడంతో సీకేఎం మైదానం మొత్తం సందడిగా మారింది.

పరపతి సంఘాలు పేద ప్రజలకు నేస్తాలు

ఖిలావరంగల్, ఏప్రిల్ 14: పరపతి సంఘాలు పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగపడుతాయని బంధుమిత్ర బజ్జూరి పరపతి సంఘం, ఖిలావరంగల్ అధ్యక్షుడు సిద్దంశెట్టి సుదర్శన్ అన్నారు. ఆదివారం పడమరకోటలో సంఘం 11వ, వార్షికోత్సవాన్ని ప్రధాన కార్యదర్శి బజ్జూరి సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. సుదర్శన్ మాట్లాడుతూ 22 సంవత్సరాల క్రితం ప్రారంభించిన సంఘం, సభ్యుల పిల్లల విద్య, వివాహ, ఇళ్ళు తదితర పనులకు ఆర్థిక భరోసాను కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి బజ్జూరి ప్రభాకర్, ఉపాధ్యక్షులు ప్రసాద్, సహాయ కార్యదర్శి రమేష్, గౌరవ అధ్యక్షుడు సుధాకర్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, సిద్దంశెట్టి అనిల్, రాజు, అజయ్ పాల్గొన్నారు.

కొమ్మాల ఆలయం వద్ద గోశాల ప్రారంభం

గీసుగొండ, ఏప్రిల్ 14: మండలంలోని కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో పాల చంద్రకళ-శ్రీనివాస్ దంపతులు రూ. 2 లక్షలతో ఏర్పాటు చేసిన గోశాలను ప్రారంభించారు. గోశాలకు అవసరమైన స్థలాన్ని అర్చకులు కాందూరి రామాచార్యులు ఇచ్చారు. కార్యక్రమంలో సాయిలి రమాదేవి ప్రభాకర్ దంపతులు, వీరాటి స్వర్ణ రవిందర్‌రెడ్డి దంపతులు, నాయకులు వీరాటి లింగారెడ్డి, అంకతి నాగేశ్వర్‌రావు, రాజగోపుర నిర్మాణ కర్త వెంకటగిరి, నాగరాజు, శ్రీనివాసాచార్యులు, ఫణిందర్, విష్ణు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడి పూజ

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 14: కేరళ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని శబరిమలైలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహించే ప్రత్యేక పూజలను ఆదివారం వరంగల్ నగరంలో అయ్యప్ప గురుస్వామి పోలా ఉమామహేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్‌వీఎన్ రోడ్డులోని మణికంఠ భవనంలో జరిగిన ఈ పడిపూజ కార్యక్రమంలో పలు అయ్యప్ప దీక్ష చేపట్టే భక్తులందరూ హాజరయ్యారు. అయ్యప్ప స్వామికి పడిపూజ అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గందె కల్పన నవీన్, పోలా ఉమామహేశ్వర్, మణికంఠ శ్రీనివాస్, పోలా ధనంజయ, బీజేపీ నాయకులు కుసుమ సతీష్ పాల్గొన్నారు.

లండన్ సిటీ ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

న్యూశాయంపేట, ఏప్రిల్ 14: హనుమకొండలోని హయగ్రీవాచారి మైదానంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫన్ అండ్ జాయ్ లండన్ సిటీ ఎగ్జిబిషన్‌ను ఆదివారం రాత్రి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌ను హనుమకొండ, వరంగల్, కాజీపేట జంట నగరాల ప్రజల కోసం ఈ సారి ఒక కొత్త వెరైటీ ఉండాలనే ఉద్దేశంతో లండన్ నగరం, యూనివర్సల్ స్టూడియోను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఇందులో 100కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీరోజు సాయంత్రం 5 గంటల నుండి 10 గంటల వరకు ప్రదర్శన ఉంటుదని, జంట నగరాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత ఇనుగాల వెంకట్రామిరెడ్డి, ఎగ్జిబిషన్ మేనేజర్ ఫిరోజ్, స్థానిక కార్పొరేటర్ రావుల కోమల కిషన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


37వ డివిజన్‌లో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సువర్ణ-సురేశ్


కరీమాబాద్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద ..


సంగెంలో పండ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కళావతి


సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో నివాళులర్పిస్తున్న సిబ్బంది

అంబేద్కర్ జయంతి వేడుకలు

విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించిన పలువురు

గిర్మాజిపేట, ఏప్రిల్ 14: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతిని ఆదివారం నగరంలో ఘ నంగా నిర్వహించారు. సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో అంబేద్కర్ చిత్రపటానికి ప్రొఫెసర్ పద్మ, జూనియర్ నర్సింగ్ అధికారి ఉమ, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శంకర్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కార్యదర్శి మీసాల ప్రకాశ్ 27వ డివిజన్ ఎల్‌వీఆర్ నగర్ గుడిసెల కాలనీలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు డి.నాగరాజు, నాయకులు కమల్, శారద, అన్వేశ్, శ్రీవిద్య, విజయలక్ష్మి, శ్రీనివాస్ పాల్గొన్నారు. రైల్వే ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్టేషన్ మేనేజర్ బి.బాలరాజు, ముఖ్య కమర్షియల్ అధికారి బి.రాజ్‌గోపాల్, ఆరోగ్య అధికారి మధు లు అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైల్వే ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం వరంగల్ శాఖ అధ్యక్షుడు పి.చంద్రమోహన్, నాయకులు సంపత్, పృథ్వీరాజ్, రాజేందర్ పాల్గొన్నారు.

● కరీమాబాద్: రంగశాయిపేట వాగ్బాట యోగా, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులఅర్పించారు. ఉర్సు నాగేంద్రనగర్‌లో కార్పొరేటర్ పోశాల పద్మ నివాసంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అంబేద్కర్ యువజన సంఘం కరీమాబాద్ శాఖ ఆధ్వర్యంలో కరీమాబాద్ ప్రాంతం నుంచి హన్మకొండ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఇసుక అడ్డా జంక్షన్‌లో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు రాజు ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు.

● సంగెం: మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి అంబేద్కర్ సెంటర్‌లో కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లయ్య, మాజీ సర్పంచ్ గుండేటి బాబు, మెట్టుపల్లి రమేష్,కందకట్ల నరహరి, సునిల్ నివాళులర్పించారు. గవిచర్లలో అంబేద్కర్ భవన్‌లో గ్రామ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, మాజీ ఎం పీటీసీ దోనికెల శ్రీనివాస్ పాల్గొన్నారు. తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ రాజ్‌కుమార్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే వరంగల్ ఆర్టీఏ కార్యాలయం ఖమ్మం జాతీయ రహదారిలో అంబేద్కర్ ఐక్య వేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ వేడుకలు నిర్వహించారు. తిమ్మాపురం మామునూరు, జక్కలొద్ది గ్రామాల అంబేద్కర్ యువజన సంఘాలు గ్రామాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించి అంబేద్కర్ జంక్షన్‌కు చేరుకున్నారు. కార్యక్రమాల్లో నాయకులు 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణ విక్టర్, చింతల యాగదిరి, సదానందం, రంజిత్, శ్రీకాంత్, జీవంతరెడ్డి, జోగిరెడ్డి, చింత ప్రకాశ్, చింత ప్రవీణ్, రవి, క్రిష్ణ పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: ఖిలావరంగల్ చెమన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్ నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పోశాల సారంగపాణి, జూలూరి శ్రవణ్‌కుమార్, కాం పెల్లి శ్యామ్ పాల్గొన్నారు. 37వ, డివిజన్ కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ-సురేష్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదళ్ల శరత్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో శివకుమార్, సంతోష్ పాల్గొన్నారు.

● వరంగల్ చౌరస్తా: అన్ని వర్గాలు అభివృద్ధి చెందాలని భావించిన గొప్ప మహనీయుడు, అంబేద్కర్ అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్ అన్నారు. శివనగర్‌లోని పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిరబోయిన రాజు, కంద్రాతి రాజు, శ్రీకాంత్, బజ్జూరి వీరేశం, పోలెపాక సాయికుమార్ పాల్గొన్నారు.

● గీసుగొండ: ధర్మారంలో కార్పొరేటర్ సుంకరి మనీషాశివకుమార్ నివాళులర్పించారు. ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో కేయూ దూరవిద్య కేంద్రం కోఆర్డినేటర్ కొక్కొండ శ్రీకాంత్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. మనుగొండలో వైస్‌ఎంపీపీ రడం శ్రావ్యభరత్‌కుమార్, సర్పంచ్ నమిండ్ల రమరాజులు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. మొగిలిచర్లలో కార్పొరేటర్ అకులపెల్లి మనోహర్, డీసీసీబీ డైరెక్టర్ రమేష్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

● వరంగల్ సిటీ: కాశిబుగ్గలో కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి నాయకులు కుసుమ సతీష్ బాబు, చిరంజీవి, తోట బాలరాజు, గుర్రం శ్యామ్, పెండ్యాల కొమురయ్య తదితరులు పాలొని అంబేద్కర్ నివాళులర్పించారు. టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, టీపీసీసీ మెంబర్ నల్గొండ రమేశ్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గుండాల మదన్‌కుమార్ తదితరులు హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మార్టిన్ లూథర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు కుసుమ సతీష్ బాబు, రత్నం సతీష్‌షా, సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, బాకం హరిశంకర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.


కాశిబుగ్గలో అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ నాయకుల నివాళి..


శివనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు


కాశిబుగ్గలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ నరేందర్

కార్మికులకు ఇంటి స్థలాలివ్వాలి

ఆజాంజాహి మిల్లు కార్మికులు ప్రభుత్వానికి వినతి


మృతి చెందిన కార్మికుల ఫోటోలను చూపుతున్న కుటుంబ సభ్యులు

ఖిలావరంగల్, ఏప్రిల్ 14: ఆజంజాహి మిల్లు భూమిలోనే కార్మికులకు ఇంటి స్థలాన్ని ఇవ్వాలని ఆజంజాహి మిల్స్ మాడిఫైడ్ వలెంటరీ రిటైర్డు 2002 వర్కర్స్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఖిలావరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో కార్మికులు, వారి కుటుంబసభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2021 అక్టోబరు 26న, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గత 20 సంవత్సరాలుగా చేసి పోరాటంలో భాగంగా కార్మికులకు ఇంటిస్థలాలు ఇవ్వాలని తీర్పునిచ్చిందన్నారు. కాగా గత ప్రభుత్వం 318 కార్మికులకు మిల్లు స్థలంలో కాకుండా అనంతసాగర్, మడిపెల్లి గ్రామంలో కేటాయించిందన్నారు. అలా కాకుండా ఆజాంజాహి మిల్లు స్థలంలోనే కార్మికులకు ఇంటి స్థలాలను ఇవ్వాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులను తప్పుదోవ పట్టించారన్నారు. కార్యక్రమంలో వివిధపార్టీల నాయకులు ఇనుముల శ్రీనివాస్, ఆరెళ్ళి కృష్ణ, ప్రవీణ్, గుత్తికొండ రవి, గద్దల సంజీవ, కుమారస్వామి, కొండ్ర మల్లయ్య, కత్తెరశాల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

'మద్దతు ధరను చట్టబద్ధం చేయాలి'


సంగెంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

సంగెం, ఏప్రిల్ 14: రైతుల పంటలకు మద్దతు ధరలను ప్రభుత్వాలు చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో రైతు సంఘం మండల శాఖ ఉపాధ్యక్షుడు తేడాల ప్రభాకర్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో పంటల కోసం చేసిన అప్పులు తీర్చే దారుల లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదేల రాజయ్య మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేసేందుకుగాను ఈనెల26న అబ్బనికుంట లోని రైతు భవన్‌లో జిల్లా స్థాయి సదస్సును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సదస్సులో హైకోర్టు మాజీ న్యాయమూర్తిచంద్రకుమార్, ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, ప్రొఫెసర్ యాదగిరి పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సిర్ల రవీందర్, కమిటీ సభ్యులు బోనాల గోపాల్, పైడి రాజరెడ్డి పాల్గొన్నారు.

'కార్మికుల పక్షాన పోరాడేది ఐఎన్‌టీయూసీ'


సమావేశంలో మాట్లాడుతున్న షేక్ అబ్దుల్ జలీల్

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 14: కార్మికుల పక్షాల పోరాడేది ఐఎన్‌టీయూసీ మాత్రమేనని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ అన్నారు. ఆదివారం ఏనుమాముల(వరంగల్) వ్యవసాయ మార్కెట్లో మార్కెట్ దడువాయి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సరసాని సురేందర్‌రెడ్డి అధ్యక్షతన దడువాయి సంఘం సమావేశం జరిగింది. టీఆర్ఎస్‌కేవీ నుంచి దడువాయి సంఘం ఐఎన్‌టీయూసీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ముఖ్యఅతిథిగా ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ మాట్లాడుతూ.. ఐఎన్‌టీయూసీకి 70ఏళ్ల చరిత్ర ఉందని, పూర్తిగా కార్మిక పక్షపాతిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీయూసీ నాయకులతో పాటు దడువాయి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి కుమార్, వరంగల్ మార్కెట్ దడువాయి సంఘం అధ్యక్షులు ఈటెల దేవేందర్, ప్రధాన కార్యదర్శి సోల రవి, అప్పని కృష్ణ, తొగరు రవీందర్, వాసం సంజీవ్, రంగు రవీందర్, తూర్పాటి రాం కిషన్, బోనాల వీరన్న పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో కీ లేడీ దంపతులు?

మట్టెవాడ, ఏప్రిల్ 14: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళా వద్ద సహాయకురాలిగా ఉన్న మహిళను ఫిబ్రవరి 24న మందులు ఇప్పిస్తామని బయటకు తీసుకెళ్లి గోపాలస్వామి గుడి జంక్షన్ వద్ద మరో వ్యక్తితో కలిసి బెదిరించిన కీ లేడి దంపతులను వరంగల్ సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. బెదిరించి డబ్బులు, బంగారు ఆభరణాలను దోచుకెళ్లిన ఈ దంపతులు గతంలో ములుగు, జనగామ, హనుమకొండ, తదితర ప్రాంతాల్లో ఇదే విధంగా బెదిరించి డబ్బులను దోచుకున్నట్లు తెలిసింది. వీరు ములుగు జిల్లాకు చెందిన వారుగా సమాచారం. ఈ దంపతులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. విచారణలో మరికొన్ని అంశాలు బయటపడే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల్లో ఇంకా ఏమైనా నేరాలకు పాల్పడ్డార అనే దానిపై లోతుగా విచారిస్తున్నట్లు తెలిసింది.

అనుమానస్పదంగా వ్యక్తి మృతి


మృతిచెందిన రవి

సంగెం, ఏప్రిల్ 14: మండలంలోని మొండ్రాయి గ్రామంలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై నరేష్ చెప్పారు. ఆయన కథనం ప్రకారం.. మొండ్రాయికి చెందిన పాక రవి(46) ఆదివారం గ్రామంలోని రైతు వేదిక సమీపంలోని ఓ రైతు వ్యవసాయ పొలం వద్ద అనుమానాస్పదంగా మృతిచెంది ఉన్నాడు. మృతుడు మద్యానికి బానిసై ఉండేవాడని ఇదే నేపథ్యంలో ఆదివారం ఉదయం ఇంట్లో వారికి చెప్పకుండా వచ్చి రైతు వేదిక సమీపంలో పడి మృతిచెంది ఉంటాడని తెలిపారు. అయితే మృతదేహం నల్లబడి, తల వెనక భాగం రక్తం గడ్డకట్టి ఉండడాన్ని అనుమానిస్తూ మృతుడి కుమారుడు ఈశ్వర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ పోస్టుమార్టంనకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయం చేస్తూ రవి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.

బస్ స్టేషన్‌లో పోలీసుల తనిఖీలు..

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 14: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇంతేజార్ గంజ్ పోలీసు స్టేషన్‌పరిధిలోని సీఐ శివకుమార్ ఆదేశాల మేరకు ముందస్తుగా వరంగల్ రైల్వే స్టేషన్, పరిసర ప్రాంతాలు తాత్కాలిక బస్టేషన్ ప్రాంగణంలో ఆదివారం పోలీసులు తనిఖీ నిర్వహించారు. బస్టాండ్‌లో అనుమానిత వ్యక్తులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.


లోహితలో విద్యార్థులు, నాటి ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గీసుగొండ, ఏప్రిల్ 14: ఎలుకుర్తి జెడ్పీ పాఠశాలలో పూర్వ విద్యార్థుల(1973-74 టెన్త్ బ్యాచ్) సమ్మేళనం ఆదివారం జరిగింది. 50 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వవిద్యార్థులు అలనాటి స్మృతులను గుర్తుచేసుకొని పరవశించి పోయారు. ముఖ్య అతిథిగా అంతర్జాతీయ కవి, గ్లోబల్‌పీస్ అవార్డు గ్రహీత మంతెన దామోదరచారి పాల్గొని మాట్లాడారు. పాఠశాల జీవితం ప్రతి ఒక్కరికి మరిచిపోలేని ఒక తీపి జ్ఞాపకం అన్నారు. కార్యక్రమంలో అనంతరెడ్డి, లక్ష్మీనారాయణ, పురుషోత్తమాచారి, సాంబయ్య, ఎల్లారెడ్డి, మాధవరెడ్డి, ప్రభాకరచారి, సూర్యనారాయణ, సారంగపాణి, సదాశివుడు, వీరమల్లు, సాంబయ్య, రమణారెడ్డి, అడ్వకేట్ అనసూర్య పాల్గొన్నారు.

● సంగెం: పూర్వ విద్యార్థుల సమ్మేళనం(1990-91 టెన్త్ బ్యాచ్) ఆదివారం లోహిత ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా జజురరిగింది. తాము చదువుకున్న పాఠశాలకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాటి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాంమూర్తి, కుమారస్వామి, నర్సయ్య,వీరస్వామి, భిక్షపతి పాల్గొన్నారు.,

ఏసీపీఎస్ ఆర్థికసాయం

మట్టెవాడ, ఏప్రిల్ 14: ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి (ఏసీపీఎస్) ఆపద్బాంధు పథకం కింద గుండె ఆపరేషన్ నిమిత్తం నల్ల పద్మ కుటుంబానికి రూ. 45 వేల చెక్కును ఆదివారం వరంగల్ ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చందా జగదీశ్వర్,కార్యదర్శి గాదె వాసుదేవ్ అందజేశారు. వారు మాట్లాడుతూఏసీపీఎస్ జాతీయ అధ్యక్షుడు గందె ప్రేమ్‌గాంధీ ప్రవేశపెట్టిన ఆపద్బాంధు పథకం కింద ఎల్కతుర్తి మండలం దండెపల్లి గ్రామానికి చెందిన నల్ల పద్మ గుండె ఆపరేషన్ నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. పద్మ కుమారుడు నల్ల శివకుమార్‌కు చెక్కును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చిదురాల నాగరాజు,దేవ అరవింద్‌బాబు, రాష్ట్ర నాయకులు విడియాల నూతన్‌కుమార్, గుండా రమేష్, టి. వాసుదేవ్, టి. వెంకటేశ్వర్లు, అశోక్ కుమార్, ధనుంజయ పాల్గొన్నారు.

జాడలేని భూసార పరీక్షలు

(5వ పేజీతరువాయి)

మొదలు కావడంతోనే విత్తనాలు నాటుకోవచ్చు.

విచ్చలవిడిగా ఎరువుల వాడకం

చాలా మంది రైతులకు భూసార పరీక్షలపై అవగాహన లేదు. ఆ ఊర్లో చుట్టు పక్కల రైతులు ఏ పంట వేస్తే దాన్నే అనుసరిస్తారు. రైతులు సాగు చేసే నేల ఏ మేరకు సారవంతమైనదనే దాన్ని భూసార పరీక్షలు చేయించి తెలుసోవాల్సి ఉన్నా అవేవి చేయడం లేదు. దీంతో ఇష్టానుసారంగా ఎరువులను, క్రిమి సంహార మందులను వాడుతారు. దీని వల్ల భూమిలో సారవంతమైన భూములు కాస్తా నిస్సారమై పోతున్నాయని మేధావులు వాపోతున్నాయి.

రైతు వేదికల్లో భూసార పరీక్షల ఏవి..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్ లెక్కన సుమారు రూ.22 లక్షలు వెచ్చించి ప్రభుత్వం రైతు వేదికలు నిర్మించింది. రైతు వేదికల్లోనే భూసార పరీక్షల కేంద్రం ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదు. అలాగే, కేంద్ర ప్రభుత్వం 2016లో నేషనల్ మిషన్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్ (ఎన్ఎంఎస్ఏ) పథకం కింద మట్టి నమూనాలు సేకరించారు. పరీక్షలు భూసార ఆరోగ్య కార్డులను రైతులకు అందించింది. మూడేళ్లపాటు కొనసాగిన ఈ పథకం ఆ తరువాత నిలిచిపోయింది.

రసాయనాలు ఉన్నంత వరకు చేశాం

రసాయనాలు ఉన్నంత వరకు భూసార పరీక్షలు చేశాం. 2019 నుంచి పరీక్షల కోసం నిధులు, రసాయనాలు లేక పరీక్షలు క్షేత్రస్థాయిలో చేయలేకపోతున్నాం. ప్రభుత్వం పరీక్షలు చేయాలని ఆదేశించి నిధులందించి, రసాయనాలు పంపిణీ చేస్తే పరీక్షలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రస్తుతం అయితే రైతులు ఇక్కడికి వచ్చి మట్టి నమూనాలు ఇచ్చి పది రూపాయలు చలానా కడితే పరీక్షలు, నీటి పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఈ సంవత్సరం 450 వరకు చేశాం.

- కృష్ణ, ఏడీఏ- భూసార, విత్తన పరీక్ష ప్రయోగశాల

రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లను అందిస్తున్న డాక్టర్ గోపాల్

నర్సంపేటటౌన్, ఏప్రిల్ 14 : నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో సంఘమిత్ర యూత్ ఆర్గనైజేషన్-నర్సంపేట, యువ నేతాజీ ఫౌండేషన్-వరంగల్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బ్లడ్ క్యాంప్ ఆర్గనైజర్స్, బ్లడ్ డోనర్, బ్లడ్ మోటివేటర్, కానిస్టేబుల్ కన్నె రాజు, సంఘమిత్ర యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు గొంగళ్ల అశోక్ నేతృత్వంలో జరిగిన రక్తదాన శిబిరంలో యువకులు పాల్గొని రక్తదానం చేశారు. 25 యూనిట్ల రక్తాన్ని సేకరించి ప్రభుత్వ ఆస్పత్రికి అందజేశారు. రక్తదానం చేసిన యువకులకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. గోపాల్ సర్టిఫికెట్లను అందజేశారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న పెద్దారపు రమేశ్

దుగ్గొండి, ఏప్రిల్ 14 : ప్రభుత్వం రైతులకు ఎన్నికల్లో ఇచ్చినహామీలు అమలుచేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని గిర్నిబావిలో ఆదివారం మండల పార్టీ కార్యకర్తలు సమావేశం నిర్వహించగా అయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, వరికి క్వింటాకు రూ.500బోనస్ ఇస్తామని, భూ సమస్య పరిష్కారం చేస్తామని ఇచ్చిన హామీలు హామీలుగానే మిగిలాయన్నారు. ప్రజల, రైతుల సమస్యలు విస్మరించి పార్టీ పిర్యాయింపులకు రాజకీయ పార్టీలు పాల్పడుతున్నాయన్నారు. సమావేశంలో ఎంసీపీఐ(యూ) డివిజన్ కార్యదర్శి ఎండీ రాజాసాహెబ్, జిల్లా నాయకుల నాగెల్లి కొంరయ్య, బాబురావు, మండల కార్యదర్శి సింగతి మల్లికార్జున్, పేరబోయిన ఐలోని, కుమారస్వామి, ఎల్లబోయిన రాజు, బుడిమే సురేందర్, ఈశ్వరయ్య, భాస్కర్, జనార్ధన్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న శ్రీనివాస్‌రెడ్డి



నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి, ఏప్రిల్ 14 : తల్లి దండ్రులను కోల్పోయి నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్న ఓ చిన్నారికి అండగా నిలిచి ఎస్ఆర్ఆర్ అధినేత పరుపాటి శ్రీనివాస్ రెడ్డి మానవత్వం చాటుకున్నారు. రాయపర్తికి చెందిన ఐత యాకయ్య 11ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా, తల్లి కొమురమ్మ మూడు నెలల క్రితం మరణించింది. దీంతో మృతుల కుమార్తె రేణుక అనాథగా మారింది. పూరి గుడిసెలో నివాసముంటూ, అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిన్నారి పరిస్థితిని చూసి శ్రీనివాస్‌రెడ్డి చలించిపోయాడు. దీంతో రూ.2 లక్షల వ్యయంతో చిన్నారికి ఇంటిని నిర్మాణం చేశాడు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం ఇంటికి గృహప్రవేశంచేసి చిన్నారికి అప్పగించాడు. భవిష్యత్తులో సైతం చిన్నారికి అండగా ఉంటూ చదువుకునేందుకు అన్ని విధాల సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లేతాకుల మధుకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బాబు, ఉల్లెంగుల నర్సయ్య సుధార్‌రెడ్డి, సంది అమ్మిరెడ్డి, కాయ్య, ఐత రాజు పాల్గొన్నారు.

దొంగ జీవోలతో బీఆర్ఎస్ మోసం

ఖానాపురం, ఏప్రిల్ 14: మండలంలో రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు దొంగ జీవోలతో బీఆర్ఎస్ నాయకులు ప్రజలను మోసం చేసి ఎన్నికల్లో లబ్ధిపొందాటానికి కుట్రలు చేశారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యద్ల జగన్మోహన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తండాలు, గ్రామాల్లో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణానికి ఎన్నికల ముందు బీఆర్ఎస్ నాయకులు హడావుడిచేసి రోడ్ల నిర్మాణానికి మంజూరిలేకున్నా మంజూరైనట్లు ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. నేడు అధికారంపోవడంతో రోడ్ల నిర్మాణాలు ముందుకుసాగకపోవడంతో కాంగ్రెస్ నాయకులే రోడ్ల నిర్మాణాలను అడ్డుకుంటున్నారని, కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారని మరోమారు తప్పుదోవ పట్టించి పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధిపొందాలని బీఆర్ఎస్ నాయకులు కుట్రపన్నుతున్నారన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి

నర్సంపేట, ఏప్రిల్ 14 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 133వ జయంతి వేడుకలను నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వివిధ రాజకీయ పార్టీలు, విద్యార్థి యువజన, దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నేత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ గుంటిరజనికిషన్, వైస్ ఛైర్మన్ మునుగాల వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు రాయిడి రవీందర్‌రెడ్డి, నల్లామనోహర్‌రెడ్డి, నాగెల్లి వెంకటనారాయణగౌడ్, గోనె యువరాజ్, మండల శ్రీనివాస్, కౌన్సిలర్ ఎండి.మహబూబ్‌పాషా, రాయిడిదుశ్యంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నియోజకవర్గ ఎన్నికల కమిటీ ఛైర్మన్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసుశ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కంభంపాటి ప్రతాప్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గూడూరు సందీప్, కొంపెల్లి రాజు, కౌన్సిలర్లు శీలంరాంబాబు, జుర్రురాజు, బాల్నెజగన్, నాయకులు పొదిల రాంచందర్, ఠాకూర్ రవీందర్‌రెడ్డి, కూనమల్ల పృథ్వీరాజ్ మల్యాల వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అక్కపల్లి రమేశ్, మియాపురం గోవర్ధన్, దిడ్డి పార్థసారధి, ఇల్లందుల సాంబయ్య, పిట్టల సతీస్ పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఆచార్య బన్న ఐలయ్య, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్, దళిత ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు గద్ద వెంకటేశ్వర్లు, కల్లెపెల్లి ప్రణయదీప్, తడుగుల విజయ్, గుంటి వీర ప్రకాశ్, కోటడెవిడ్, కాం గ్రెస్ నాయకులు తక్కళ్ల రవీందర్‌రావు, పెండెం రామానంద్, బత్తిని రాజేందర్, ఎలకంటి విజయ్‌కుమార్, మాదాసి రవి, మాలమహానాడు దార గణేశ్, గుంటి శ్రీనివాస్, ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి తేజావత్ వాసూనాయక్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకులు ఝైసి శోభన్‌బాబు, ఆరెపల్లి బాబు కార్యకర్తలతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

• నర్సంపేట టౌన్ : మండలంలోని గార్లగడ్డతండాలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు వీరన్న ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్వేరోస్ భద్రాద్రి జోన్ అధికార ప్రతినిధి రఘుపతి స్వేరో మాట్లాడుతూ అంబేద్కర్ జయంతిని ఐక్యరాజ్య సమితి ప్రపంచ జ్ఞానదినోత్సవంగా ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో మహేశ్, వీవో అధ్యక్షురాలు బానోతు కమలమ్మ, బంజార యూత్ బాధ్యులు హుస్సేన్, అజ్మీర వీరన్న, బానోతు లక్ష్మన్ పాల్గొన్నారు.

• వర్ధన్నపేట రూరల్ : భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, డీసీసీబీ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఇల్లందలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని విద్యార్థులకు బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ పార్టీ పట్టణంతో పాటు మండలంలోని కడారిగూడెంలో మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, జడ్పీటీసీ మార్గం భిక్షపతి ఆధ్వర్యంలో, బీజేపీ పట్టణ అధ్యక్షుడు చీటూరి రాజు ఆధ్వర్యంలో, కడారిగూడెంలో బీజేపీజిల్లా నాయకులు జడ సతీష్, మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో, మండలంలోని అంబేద్కర్‌నగర్ గ్రామంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చాడ మరియాసురేఖ, వర్ధన్నపేట మునిసిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ ఇజోనా ఆధ్వర్యంలో, పట్టణంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య ఆధ్వర్యంలో, చెన్నారంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి బర్ల సహదేవ్ ఆధ్వర్యంలో, నల్లబెల్లిలో సెర్ఫ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గోలి కొమురయ్య ఆధ్వర్యంలో, దివిటిపెల్లిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, మునిసిపాలిటీ ఛైర్మన్ ఆంగోతు అరుణ, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, కౌన్సిలర్ సమ్మెట సుధీర్, కొండేటి శ్రీనివాస్, సిలివేరు కుమారస్వామి, శ్రీధర్, రాజు, శ్రావణ్, మంద రవి, ఈరెల్లి శ్రీనివాస్, యాకయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

• రాయపర్తి : దేశంలోని ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సూచించారు. ఆదివారం అంబేద్కర్ జయంతి సందర్భంగా మండల కేంద్రంతో పాటు మండలంలోని మైలారం గ్రామంలో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, మాచర్ల ప్రభాకర్, రెంటాల గోవర్ధన్‌రెడ్డి, సుదర్శన్, మచ్చ నీలయ్య, బాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గౌరవం దక్కే విధంగా రాజ్యాంగాన్ని తీసుకువచ్చిన అంబేద్కర్‌కు రుణపడి ఉండాలన్నారు. దేశంలో మళ్లీ బీజేపీ అధికారంలో వస్తే రాజ్యాంగం ప్రమాదంలో పడే అవకాశముందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగుకుమార్, ఎంపీటీసీ ఐత రాంచందర్, మాజీ సర్పంచ్ గారె నర్సయ్య, అంబేద్కర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

• నెక్కొండ : మండల కేంద్రంలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, బీఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సంగని సూరయ్య, ఎంపీపీ జాటోతు రమేష్, కొమ్ము రమేష్‌యాదవ్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకుడు చాగంటి వెంటకయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా బాధ్యులు ఈదునూరి యాకయ్య, సీపీఐ మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు బీజేపీ మండల అధ్యక్షుడు సొంటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, యువజన సంఘం నాయకుడు ఈదునరి యాకుబ్, దళిత సంఘం నాయకులు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రైల్వే టికెట్ల ఫోరం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

• ఖానాపురం : అంబేద్కర్ జయంతి వేడుకలను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యద్ల జగన్మోహన్‌రెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు ఆధ్వర్యంలో, ఎస్సీ కాలనీలో మాల కుల సంఘం కమ్యూనిటీ హాల్ వద్ద ఓడీసీఎంఎస్ ఛైర్మన్ గుగులోతు రామస్వామినాయక్, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో, ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ప్రజాదండోర వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు అందె రవి ఆధ్వర్యంలో, ధర్మరావుపేటలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు అలవాల కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో, అశోక్‌నగర్‌లో ఉపాధ్యాయుడు గాదరి ఉప్పలయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మహాలక్ష్మీ వెంకటనర్సయ్య, మౌలానా, ఎంపీటీసీ మూడు పూల్‌సింగ్, ముస్తఫా, గుళ్లపెల్లి విజయ్, ముడుసు రమేష్, బాల్నె యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

• పర్వతగిరి : అంబేద్కర్ జయంతి వేడుకలను మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. గోపనపెల్లిలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, చింతనెక్కొండలో హితకారిణి సేవాసంఘం అధ్యక్షుడు గటికె మల్లయ్య మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, యూత్‌కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందికట్ల అనీల్, ఎంపీటీసీ బొట్ల మహేంద్ర, నాయకులు రాంచందర్, గంగాధర్‌రావు, సునీల్‌రావు, శంకర్, సురేందర్‌రావు, ఏనుగల్లులో వరంగల్ పార్లమెంటు స్వతంత్ర అభ్యర్థి గనిపాక ప్రదీప్, అనంతారంలో సొసైటీ ఛైర్మన్ గొర్రె దేవేందర్, మాజీ సర్పంచ్ తౌటి దేవేందర్, కార్తీక్ అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

• చెన్నారావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లింగగిరిలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ భాస్కర్, అమీనాబాద్‌లో మాజీ సర్పంచ్ సిద్దెన రమేష్, మండల కేంద్రంలో సిద్దార్థలో విద్యా సంస్థల ఛైర్మన్ కంది గోపాల్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ నియోజవర్గ ఇన్‌చార్జి ఆకులపెల్లి ఉప్పల్లయ్య, పాత మగ్దుంపురంలో యువ జ్యోతి యూత్ అధ్యక్షుడు గద్దల ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు తాల్లపెల్లి నర్సయ్యగౌడ్, పాపయ్యపేటలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న, మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు నర్మెట్ట యాదగిరి మహేందర్, ఎస్ఐ గూడ అరుణ్‌కుమార్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సహకార సంఘం డెరెక్టర్‌లు రాజు, మహేందర్‌రెడ్డిలు. కోనాపురంలో మాజీ సర్పంచ్ వెల్ద సుజాత, సారంగం, ఎడ్ల నారాయణరెడ్డిలు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు. అభిమానులు పాల్గొన్నారు.

• నల్లబెల్లి : మండలంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి, జై భీమ్ నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల దళిత నాయకులు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు అంబేద్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

• దుగ్గొండి : మండలంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తిమ్మంపేట, వెంకటాపురం గ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహాలకు, తిమ్మంపేట జీపీ కార్యాలయంలో అన్ని వర్గాలకు చెందిన వారు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోడెం విద్యాసాగర్, సోమ భాస్కర్, తోటకూరి రాజు, అనుమాండ్ల సమ్మిరెడ్డి, దాసి నవీన్, తోటకూరి శ్రీనివాస్, ఈదుల వెంకటేశ్వర్లు, వీరస్వామి, విఘ్నేశ్వర్ , కునూరు సతీష్, జనార్ధన్‌రెడ్డి, నాగెల్లి భాస్కర్, అక్కపెల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేటలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది



నర్సంపేటలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



వర్ధన్నపేటలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



రాయపర్తిలో అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



రాయపర్తిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై

పర్వతగిరి, ఏప్రిల్ 14 : గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాస్, ఎస్సై వెంకన్న తెలిపారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు వివరాలను వెల్లడించారు. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన సన్నిరెడ్డి రాకేష్ జియో ఫైబర్ వర్క్‌లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం తన ద్విచక్రవాహనంపై బ్యాగులో ఎండు గంజాయిని తీసుకెళ్తూ సోమారం క్రాస్‌రోడ్ వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి పారిపోతుండగా ఎస్సై వెంకన్న తన సిబ్బందితో అతడిని పట్టుకుని బ్యాగును తనిఖీ చేశారు. బ్యాగులో 2 కేజీల 190 గ్రాముల ఎండు గంజాయి లభించిందని, దాని విలువ రూ.54,750 ఉంటుందని తెలిపారు. దర్యాప్తులో భాగంగా కరీంనగర్‌కు చెందిన దమ్మాని నవీన్ అనే వ్యక్తి వద్ద నుంచి గంజాయిని తెచ్చి సప్లై చేస్తున్నాడని తెలిపారు. దీంతో రాకేష్‌తో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

బెల్టు షాపులు పూర్తిగా మూసివేయాలి

వర్ధన్నపేటరూరల్, ఏప్రిల్ 14 : గ్రామాల్లో ఉన్న బెల్టు షాపులను పూర్తిగా మూసివేయాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ స్వరూప హెచ్చరించారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల బెల్టు షాపులు, గుడుంబా స్థావరాలపై దాడులుచేసి మద్యాన్ని, గుడుంబా, గుడుంబా బెల్లాన్ని స్వాధీనంచేసుకుని, వాటి నిర్వాకులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో గత నెల రోజులుగా ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించామని వివరించారు. ఈ దాడుల్లో 21మంది బెల్టు షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేయగా వారి నుంచి 57లీటర్ల మద్యం, 47లీటర్ల బీర్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇక గుడుంబా స్థావరాల పై దాడులు చేసి 69 కేసులు నమోదు చేసి వీటిలో 35 మందిని అరెస్టుచేశామన్నారు. వీరి వద్ద నుంచి 300 లీటర్ల గుడుంబా, 22450 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 180 కేజీల గుడుంబా బెల్లం,70 కేజీల స్పటిక స్వాధీనం చేసుకుని 6 వాహనాలను సీజ్‌చేసినట్లు స్పష్టంచేశారు. అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని, పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.

• బెల్టు షాపులకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

నెక్కొండ : బెల్టు షాపులకు మద్యంను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని టాస్క్ పోర్స్ ఎక్సైజు సీఐ రమేష్ చందర్ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని వైన్స్ షాపులను ఎస్సై మహేందర్, ఎక్సైజు సీఐ శ్రావణిల ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని రెండు వైన్స్ షాపులను తనిఖీ చేసి శ్రీనువాస వైన్స్ షాపునకు రూ.25 వేలను జరిమానా విధించామన్నారు. అలాగే మండలంలోని చిన్న కొర్పోల్, పెద్ద కొర్పోల్ గ్రామాల్లో బెల్టు షాపులను నిర్వహిస్తున్న వారిపై దాడులు చేసి రూ.23,280 విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే పబ్బతి సుధాకర్, సర్వర్ మీయా, అనంతుల వీరేష్‌లపై కేసులు నమోదు చేశామన్నారు. అలాగే అలంకానిపేట, రెడ్లవాడలో రూ.23వేల విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్టు షాపుల్లో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న నెక్కొండ గ్రామానికి చెందిన కామరూని బేగం, రెడ్లవాడకు చెందిన గోరేజు ప్రమీల, కాసుల వెంకన్న, పనికర గ్రామానికి చెందిన ఓరుగంటి సాంబయ్య, కొంతల సతీష్, అలంకానిపేటకు చెందిన చిదరాల మురళిలపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌పోర్సు ఎక్సైజు, పోలీసుల అధికారులు పాల్గొన్నారు.

వేసవి కాలంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 14 : వేసవి కాలంలో అగ్నిప్రమాదాలు సంభవించకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వర్ధన్నపేట ఫైర్ స్టేషన్ అధికారి భదయ్య సూచించారు. ఆదివారం పట్టణంలోని అగ్నిమాపక కార్యాలయంలో వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1944 ఏప్రిల్ 14న ముంబయ్ నగరంలోని విక్టోరియా యార్డులో ఓ నౌక అగ్ని ప్రమాదం సంభవించి విధి నిర్వహణలో అసువులు బానిన సిబ్బందికి గుర్తుగా ప్రతి ఏటా ఏప్రిల్ 14నుంచి 20 వ తేది వరకు అగ్నిమాపక వారోత్సవాలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి వాటిని నివారించడమే లక్ష్యంగా ఐదు రోజుల పాటు కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

నర్సంపేట, ఏప్రిల్ 14 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో ఆదివారం పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక ఎన్నికల సమయంలో ఇచ్చిన రైతుల పంటలకు గిట్టుబాటు ధర, ఎంఎస్పీ, నిరుద్యోగులకు ప్రతీ ఏటా రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీలు నేటికి అమలుకు నోచుకోలేదని విమర్శించారు. పేదలందరికి రూ.15 లక్షల వంతున అకౌంట్‌లలో జమచేస్తామని హామీఇచ్చి పేదలను మోసం చేశారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుతామన్న హామీ అమలుకు నోచుకోలేదన్నారు. వ్యవసాయ రంగానికి చేయూతనివ్వాల్సిన కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం కోసం మూడు రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చిందన్నారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి యాజమాన్యాలకు కార్పొరేట్ శక్తులకు దోపిడీ చేసే విధంగా చట్టాలను మార్చిన చరిత్ర బీజేపీకి ఉందన్నారు. వివిధ రాష్ట్రాలలో ఎన్నికైన ప్రాంతీయ పార్టీలను విచ్ఛిన్నం చేసే విధంగా ప్రయత్నాలుచేసి ఆయా రాష్ట్రాలలో అధికారంలోకి రావడానికి బీజేపీ కుట్రలు చేస్తుందని విమర్శించారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పి వామపక్ష లౌకికశక్తులను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈసంపల్లి బాబు, కొరబోయిన కుమారస్వామి, నమీండ్ల స్వామి, అనంతగిరి రవి, గడ్డమీది బాలకృష్ణ, కందికొండరాజు, ఎండి.ఫరీదా, రుద్రారపు లక్ష్మి పాల్గొన్నారు.

జాడలేని భూసార పరీక్షలు

(5వ పేజీతరువాయి)

మొదలు కావడంతోనే విత్తనాలు నాటుకోవచ్చు.

విచ్చలవిడిగా ఎరువుల వాడకం

చాలా మంది రైతులకు భూసార పరీక్షలపై అవగాహనలేదు. ఆ ఊర్లో చుట్టు పక్కల రైతులు ఏ పంట వేస్తే దాన్నే అనుసరిస్తారు. రైతులు సాగు చేసే నేల ఏ మేరకు సారవంతమైనదనే దాన్ని భూసార పరీక్షలు చేయించి తెలుసోవాల్సి ఉన్నా అవేవి చేయడం లేదు. దీంతో ఇష్టానుసారంగా ఎరువులను, క్రిమిసంహార మందులను వాడుతారు. దీని వల్ల భూమిలో సారవంతమైన భూములు కాస్తా నిస్సారమై పోతున్నాయని మేధావులు వాపోతున్నాయి.

రైతు వేదికల్లో భూసార పరీక్షల ఏవి..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్ లెక్కన సుమారు రూ.22 లక్షలు వెచ్చించి ప్రభుత్వం రైతు వేదికలు నిర్మించింది. రైతు వేదికల్లోనే భూసార పరీక్షల కేంద్రం ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదు. అలాగే, కేంద్ర ప్రభుత్వం 2016లో నేషనల్ మిషన్ ఫర్ సస్టైయినబుల్ అగ్రికల్చర్ (ఎన్ఎంఎస్ఏ) పథకం కింద మట్టి నమూనాలు సేకరించారు. పరీక్షలు భూసార ఆరోగ్య కార్డులను రైతులకు అందించింది. మూడేళ్లపాటు కొనసాగిన ఈ పథకం ఆ తరువాత నిలిచిపోయింది.

రసాయనాలు ఉన్నంత వరకు చేశాం...

కృష్ణ, ఏడీఏ, భూసార, విత్తన పరీక్ష ప్రయోగశాల

రసాయనాలు ఉన్నంత వరకు భూసార పరీక్షలు చేశాం. 2019 నుంచి పరీక్షల కోసం నిధులు, రసాయనాలు లేక పరీక్షలు క్షేత్రస్థాయిలో చేయలేకపోతున్నాం. ప్రభుత్వం పరీక్షలు చేయాలని ఆదేశించి నిధులందించి, రసాయనాలు పంపిణీ చేస్తే పరీక్షలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రస్తుతం అయితే రైతులు ఇక్కడికి వచ్చి మట్టి నమూనాలు ఇచ్చి పది రూపాయలు చలానా కడితే పరీక్షలు, నీటి పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఈ సంవత్సరం 450 వరకు చేశాం.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



రాధమ్మ (ఫైల్)

నల్లబెల్లి, ఏప్రిల్ 14 : వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని నారక్కపేట గ్రామానికి చెందిన ముస్కుల రాధమ్మ(70) ఆదివారం ఉదయం మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఇదే గ్రామానికి చెందిన రాధమ్మ భర్త ఆదిరెడ్డి ఈ నెల 4వ తేదిన ద్వి చక్ర వాహనంపై కూర్చోబెట్టుకొని పని నిమిత్తం నర్సంపేటకు వెళ్లి, తిరిగి మళ్లీ నారక్కపేట గ్రామానికి వస్తున్న క్రమంలో గ్రామ బస్టాండ్ సమీపంలోకి చేరుకోగానే రాధమ్మ చీర ద్విచక్ర వాహనంలో చిక్కుకుంది. దీంతో వాహనంపై నుంచి ఇరువురు కిందపడగా, రాధమ్మకు తీవ్రమైన గాయాలయ్యాయి. తక్షణమే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి రాధమ్మను తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. మృతురాలి కుమారుడు ముస్కుల శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.